క్లుప్తంగా

నేడు గ్రామాల్లో జగనన్న సురక్ష

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యేలు బుధవారం తెలిపారు.

నేడు యర్నగూడెంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

దేవరపల్లి: యర్నగూడెంలో సుమారు రూ.1.29 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను గురువారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించనున్నట్టు సర్పంచ్ బొంతా భరత్‌బాబు తెలిపారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.42 లక్షలతో రెండు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల భవనాలు, రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన హెల్త్ క్లీనిక్ భవనం, రూ.30లక్షలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే తలారి ప్రారంభించనున్నారని తెలిపారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ



విద్యార్థినులకు దుస్తులు అందజేస్తున్న కాశీకృష్ణ

దేవరపల్లి: స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు శ్రీకాకోళపు కాశీ కృష్ణ బుధవారం దుస్తులు అందజేశారు. 20 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున ఉచితంగా అందజేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయులు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.శ్రీలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఉస్సే శంకరుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

దేవరపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సెకండ్ సెమిస్టరీ పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 పాఠశాలలకు 16,038 పాఠ్యపుస్తకాలను సరఫరా చేసినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తారని తిరుమలదాస్ తెలిపారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

నిడదవోలు రూరల్: ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో బుధవారం ఆయన సమీక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఇంకా ఎంత మంది ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందనే వివరాలను సేకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ట్రాన్స్‌జెండర్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. డీటీ శ్రీనివాసరావు, బీఎల్వోలు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు

నిడదవోలు: పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతుందని కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్ అన్నారు. పట్టణంలో జ్యోతికాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న మడతల నాగేశ్వరరావు, కిర్లంపల్లి సుజాత, వీరమళ్ల నారాయణలను బుధవారం వలంటీర్లతో కలిసి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి కార్పొరేట్ స్థాయిలో అందుతున్న వైద్య సేవలను వారికి వివరించి భరోసా కల్పించారు. వారికి పండ్లు, రొట్టెలు అందజేశారు. వలంటీర్లు మామిడి శిల్ప, దాకే బేబి సువర్ణ, కోటి జయశ్రీ, కర్రి దుర్గభవాని, పాలాసు ధనలక్ష్మి, పల్లి రాజు, కొయ్యే అనిల్‌కుమార్, శివ దుర్గ, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

కొవ్వూరు: ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా బుధవారం పట్టణంలో దుకాణాలను తనిఖీ చేసినట్టు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటరమణ తెలిపారు. ఇరవై కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుకాణదారుల నుంచి రూ.3,500 అపరాధ రుసుం వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

దేవస్థానం క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం నిర్వహిస్తున్న పద్మావతి క్యాంటీన్‌ను రెండేళ్ల కాలపరిమితికి లీజుకిచ్చేందుకు దేవస్థానం అధికారులు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ పాటలో ముగ్గురు పాటదారులు పాల్గొనగా, రాళ్లకుంటకు చెందిన వాసిరెడ్డి చంద్రశేఖర్ నెలకు రూ.1.60 లక్షలకు పాట దక్కించుకున్నారు. దీన్ని దేవస్థానం అధికారులు క్యాంటీన్‌ను ఆయనకు ఇచ్చేందుకు ఖరారు చేశారు.

నిందితుడి అరెస్టు

కొవ్వూరు: సారా కేసులో పరారీలో ఉన్న తాళ్లపూడి మండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన బాలం కోటి అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతుడిని కొవ్వూరు కోర్టుకి హాజరు పరిచినట్టు తెలిపారు.

అందుబాటులోకి డిజిటల్ విద్య

- పాఠశాలల్లో డిజిటల్ బోధన
- బ్లాక్ బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులు
- ఉపాధ్యాయులకు శిక్షణ

నల్లజర్ల: పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు కాలం చెల్లనుంది. బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్‌లు అవసరం లేని డిజిటల్ బోధన అందుబాటులోకి రానుంది. విద్యార్థులకు ఇప్పటి వరకూ తరగతి గదిలో ఏ పాఠ్యాంశం బోధించాలన్నా ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డు, గ్రీన్ బోర్డులపై చాక్‌పీస్‌తో రాసి వివరించేవారు. ఇక నుంచి వీటి స్థానంలో డిజిటల్ బోర్డులు రానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాల్లో భాగంగా ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశపెట్టింది. దీనికి అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ డిజిటల్ విద్యకు కావాల్సిన డిజిటల్ బోర్డులను ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సరఫరా చేసింది. వీటిని ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణ తరగతులు సమీపంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. ఇక నుంచి వీటి ద్వారా పాఠ్యాంశాలు బోధించనున్నారు. ఏ కార్పొరేట్ స్కూలులో కూడా ఇంతటి అధునాతన విధానం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చింది.

- నల్లజర్ల మండలంలో 57 పాఠశాలలు ఉండగా అందులో 9 ఉన్నత, 4 యూపీ, 44 ప్రాథమిక పాఠశాలలు ఉండగా వీటిలో 5492 మంది విద్యార్థులు ఉన్నారు.
- దేవరపల్లి మండలంలో మొత్తం 44 పాఠశాలలు ఉండగా ఏడు ఉన్నత, రెండు యూపీ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 5192 విద్యార్థులు ఉన్నారు.

బ్లాక్‌బోర్డులకు స్వస్తి

ప్రభుత్వం విద్యలో ఆధునిక టెక్నాలజీకి అధిక ప్రాముఖ్యతనిస్తోంది. ప్రతి విద్యార్థికి పాఠం అర్థమయ్యేలా మంచి విజ్ఞానం పొందేలా వనరులు సమకూర్చుతోంది. ఇప్పటి వరకూ చాక్‌పీస్‌లతో బ్లాక్‌బోర్డుపై రాసే విధానానికి స్వస్తి పలకనున్నారు. ప్రస్తుతం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో దీనిని అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల చొప్పున రెండు వారాల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ప్రోగ్రాం)కింద పాఠశాలలకు డిజిటల్ బోర్డులు అందిస్తున్నారు.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు



డిజిటల్ విద్యపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

ఉపాధ్యాయులకు శిక్షణ ఇలా..

డిజిటల్ విద్యలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు వారికి కావాల్సిన శిక్షణను ఇస్తున్నారు. ఇంటర్‌నెట్ అనుసంధానంతో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డును ఏ విధంగా ఉపయోగించాలనేది వివరిస్తున్నారు. ఇప్పటి వరకూ ఉపాధ్యాయుడు కొత్త విషయాన్ని విద్యార్థులకు చెప్పాలంటే సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని వివరించాల్సి వచ్చేది. ఈ కొత్త విధానంలో ఒక క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలు చూపించవచ్చు. లెక్కలు, సైన్సు పాఠ్యాంశాల బోధన సమయంలో కొన్ని చిత్రాలు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వాటిని వీటిపై చేతితో వేయాల్సిన పని ఉండదు. గతంలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే వెంటనే దానిని బోర్డుపై దాన్ని ప్రదర్శించి సందేహాలు నివృత్తి చేయవచ్చు.

సులభంగా వివరించవచ్చు

ఐఎఫ్‌పీ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలైనా సులభంగా వివరించవచ్చు. దీనికి తోడు దృశ్య, శ్రవణంతో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంది. మ్యాప్‌లు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను నేరుగా ఫొటోలతో సహా చూపించడానికి వీలవుతుంది.

– కొండయ్య, మాస్టర్ ట్రైనర్, వైజ్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రకాశరావుపాలెం

నూతన ఒరవడి

విద్యావిధానంలో ఇదో నూతన ఒరవడి. ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేయడం వల్ల విద్యార్థులకు వాటిని గుర్తుంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటోంది. ఇప్పటి వరకూ బ్లాక్ బోర్డుపై చెప్పిన వాటినే ఈ విధానంలో చెబుతాం. ఎక్కువ కాలం విద్యార్థుల మదిలో పాఠాలు నిలచిపోతాయి.

– బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు

వలంటీర్లకు వందనం

సేవలకు సలాం

కరోనా కష్టకాలంలో బంధుమిత్రులు సహా ఒకరికొకరు లేకుండాపోయారు. ఫలితంగా పేదలు, అనాథల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆ సమయంలో వలంటీర్లు సేవలందించారు. కరోనా బారిన కుటుంబాలకు తోడుగా నిలబడ్డారు. చాగల్లు శివారు మీనానగరానికి చెందిన వలంటర్ బెజవాడ విజయలక్ష్మి ఆ కుటుంబాల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని, కోవిడ్ నియంత్రణకు తీసుకుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించేది. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన మందులను, మాస్కులను వారి ఇళ్లకు వెళ్లి ఇచ్చింది. కూరగాయాలు, నిత్యవసర వస్తువులు, వృద్ధులకు దాతల అందించే ఆహారపొట్లాలను వారికి చేరవేసి సహాయపడింది. ఆ సమయంలో వలంటీర్ సేవలు వర్ణించలేవి. ఇప్పటికీ ప్రతి ఇంటికీ వెళ్లి అందరినీ పలకరించి, ఏ అవసరం వచ్చినా తీరుస్తుంది. ఆమె కన్న కూతురు కన్నా ఎక్కుగా సేవలందిస్తోందని ఆయా కుటుంబాల వారు చెబుతున్నారు.

– చాగల్లు



కరోనా సమయంలో వీరవల్లి లక్ష్మమ్మకు భోజనం అందిస్తున్న వలంటీర్

సేవలు వెలకట్టలేం



మా వలంటీర్ విజయలక్ష్మి సేవలు వెలకట్టలేనివి. ఆమె ద్వారా ఇంటికి ముగింటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మా కుటుంబంలో పిల్లల చదువులకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవేన, వసతి దీవెన, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆసరా పథకాలు అందుతున్నాయి. ఇంటి స్థలం కూడా మంజూరైంది.

– మట్టి వెంకటరమణ, మీనానగరం, చాగల్లు మండలం

'సురక్ష'తో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



యర్నగూడెంలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి నూరుశాతం సంక్షేమ పథకాలు అందించడానికే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. యర్నగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సర్పంచ్ బొంతా భరత్‌బాబు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామంలో 1625 మంది వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేయగా, నూరు శాతం పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, మండల ప్రత్యేక అధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, పలువురు నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరాజుపాలెంలో..

నల్లజర్ల: సింగరాజుపాలెంలో బుధవారం సాయంత్రం సర్పంచ్ గద్దే బాలగంగాధరతిలక్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష గ్రామసభకు ఎమ్మెల్యే తలారివెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 986 మంది లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వామిశెట్టి పావనీ కుమారి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, గ్రామపెద్ద వామిశెట్టి పరమేశ్వరావు, మండల సచివాలయాల కన్వీనర్ కటారి రాజకుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దారు కిశోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలు, రేషన్, కౌలు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: మండలంలో మద్దూరు, సీతంపేట గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల పాల్గొని మాట్లాడారు. మండలంలో 92,884 మందికి ధృవీకరణ పత్రాలు అందజేశామన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- నల్లాకులవారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెరవలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం నల్లాకులవారిపాలెంలో బుధవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం ప్రజల వద్దకే నేరుగా అందుతోందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి మీరంతా అండగా ఉండాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాలు పనులు ఉచితంగా అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గ్రామంలో సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ, కోర్ల ఉదయ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా పాలేశ్వరరావు, నల్లాకుల లీలా కుమార్, కోపెల్ల వెంకటేశ్వరరావు, కోపెల్ల తాతయ్య, ఆకుల ధనరాజ్, పాలా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



నల్లాకులవారిపాలెంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల



నిడదవోలు వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. రైతుల సాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలను పెంచుతున్నారు. దీనిలో భాగంగా విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు బుధవారం 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు వదిలిపెట్టారు. పశ్చిమడెల్టాలో పరిధిలో రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాలువలకు కూడా నీటి విడుదలను పెంచుతున్నారు. నరసాపురం కాలువకు 1888 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1302 క్యూసెక్కులు, తణుకు కాలువకు 811క్యూసెకులు, అత్తిలి కాలువకు 557 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

కలెక్టర్ మాధవీలత



గోపాలపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే మనిషి మనుగడ సాధ్యమవతుందని, అందువల్ల ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలని ఆమె ఆకాంక్షించారు. గోపాలపురం ఏఎంసీ ఆవరణలో బంగారు కొండ పథకంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులకు పోషకాహార కిట్లు కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిరెడ్డి నాగరాజు, కూసం రామమోహన్‌రెడ్డి, యండపల్లి కవిత, కప్పల వరలక్ష్మి, ఎంఈవో జి.శ్రీనివాసరావు, సీడీపీఓ సుందరి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. యర్నగూడెం బీసీ ఏరియాలో పంచాయతీ నిధులు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్నగూడెంలో గత రెండేళ్లల్లో రూ.3.82 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో పాటు తాను ప్రభుత్వం నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణం, నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్ బాబు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఉపసర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రక్షిత తాగునీరు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఉండ్రాజవరం: ప్రతి కుటుంబానికి రక్షిత తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా కాల్దారీ గ్రామంలో రూ.90 లక్షలతో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు, పైపులైన్ల పనులకు, తాగునీటి కుళాయిల ఏర్పాటుకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. జలజీవన్ పథకం ద్వారా మండలంలో రూ.22.40 కోట్లు అంచనాతో 16 పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, సర్పంచ్ చిప్పళ్ల కుమారి, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సచివాలయ కన్వీనర్లు సాధనాల ఉమ, ఏవీవీ సత్యనారాయణ, బందుల మహాలక్ష్ముడు, శ్రీనివాసు, ఇసాక్, శ్రీను,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి : ఎంపీపీ

వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: స్త్రీనిధి రుణాలు స్వాహా జరిగినట్టు విచారణలో తేలినా అందుకు బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని వెలుగు ఏపీఎం నాగరాజును ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ నిలదీశారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఖండవల్లిలో స్త్రీనిధి నిధులు దుర్వినియోగం చేసినట్టు విచారణలో నిర్ధారణ అయినా అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు లేవు, సొమ్ములు రికవరీ లేదు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు అంటూ నిలదీశారు. దీనిపై ఏపీయం నాగరాజు వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎంపీడీఓ దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇళ్ల నిర్మాణానికి వెలుగు ద్వారా ప్రతి లబ్ధిదారుడుకి రూ.35 వేలు రుణం ఇవ్వాలని అంటే దానికి విరుద్ధంగా ప్రతి డ్వాక్రా మహిళకు ఇచ్చారని, ఎవరు ఇవ్వమన్నారంటూ ఏపీఎంను నిలదీశారు. దీనికి సంబంధించిన వివరాలు మొత్తం తనకు అందించాలని ఆదేశించారు. ఎంఈఓ బీఎస్ స్వరూప్, వ్యవసాయాధికారి మేరీ కిరణ్, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి తదితరులు గ్రామాల్లో అభివృద్ధిని వివరించారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు

నిడదవోలు: యువత చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జేవ్వల రాంబాబు అన్నారు. పట్టణంలోని చర్చిపేటలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జైభీమ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్‌క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈక్లబ్ అధ్యక్షుడిగా తూరుగోపి నాని, ఉపాధ్యక్షుడిగా దాకే సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మద్రిపూడి రాజేష్, కార్యదర్శిగా తూరుగోపు పృధ్వీ, కోశాధికారిగా జీవపాటి శ్రీను, సభ్యులను ఎన్నికయ్యారు.

దారవరంలో ఫ్యామిలీ డాక్టర్

చాగల్లు: దారవరం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ పీఆర్ఎల్ దేవి సేవలందించారు. సుమారు 45 మందిని పరీక్షించి, మందులు అందించారు. 104 వైద్య సిబ్బంది, ఎంపీహెచ్ఎం ఎం.రాజశేఖర్ ఎంఎల్‌హెచ్‌పీ కె.ఉమా, ఏఎన్ఎం కె.వెంకటలక్ష్మి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. తెల్లవారు జాము నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో జిల్లాలో 14.2 మి.మీటర్లు సరాసరి వర్షపాతం నమోదైంది. తాళ్లపూడిలో గరిష్టంగా 30.8 మిల్లీమీటర్లు వర్షం కురిసింది.గోపాలపురంలో 17.8, గోకవరంలో 11.8 మిల్లీమీటర్లు, నల్లజర్లలో 21.2, దేవరపల్లిలో 17.2, కొవ్వూరులో 12.6, చాగల్లులో 14.0, కోరుకొండలో 12.2, రాజమహేంద్రవరం అర్బన్‌లో 13.4, రాజమహేంద్రవరం రూరల్‌లో 13.2, రాజానగరంలో 15.4, రంగంపేటలో 13.8, బిక్కవోలులో 8.4, అనపర్తిలో 11.4, నిడదవోలులో 15.4, కడియంలో 9.6, సీతానగరంలో 20.4 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో తెరుపు ఇచ్చినప్పటికీ మధ్యాహ్నం నుంచి మళ్లీ ముసురు మొదలైంది.

రైతుల పురోగాభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పడాలి



దొమ్మేరులో రైతులకు రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న రాజీవ్ కృష్ణ, జేజేశ్వరరావు

కొవ్వూరు: బ్యాంకులు రైతుల పురోగాభివృద్ధికి తోడ్పాటునందించాలని పరిశ్రమలు, మౌళిక సదుపాయాల కల్పన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ పేర్కొన్నారు. దొమ్మేరు గ్రామంలో బ్యాంకు ఆఫ్ బరోడాలో నిర్వహించిన రైతు మహా సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలని సూచించారు. రైతు మహోత్సవంలో భాగంగా రైతులకు మంజూరు చేసిన రుణ మంజూరు పత్రాలను, ట్రాక్టర్‌ను రాజీవ్ కృష్ణ, బ్యాంకు డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎస్.జేజేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు), జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, సర్పంచ్ తానేటి కుమారి, అన్నదేవర పేట, వాడపల్లి, పశివేదల శాఖల మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేపై సమీక్ష

కొవ్వూరు(తాళ్లపూడి): ఓటర్ల నమోదుపై ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు తాళ్లపూడి తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి టి.రాధిక సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. కొత్త ఓట్ల నమోదు, ఓటర్ల జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులు తదితర వాటిపై సర్వే చేయాలన్నారు.